ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
3
బుధవారం 14 ఫిబ్రవరి 2024

కీలక శాఖల అధికారుల బదిలీ

మేడ్చల్ ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో పలు కీలక శాఖలకు చెందిన జిల్లా అధికారులు బదిలీ అయ్యారు. డీపీవో రమణమూర్తి వనపర్తి జిల్లాకు బదిలీ కాగా, ఇక్కడికి ములుగు జిల్లా నుంచి వెంకన్న రానున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి పద్మజారాణి కామారెడ్డికి బదిలీ కాగా మేడ్చల్ జిల్లాకు ఎం.సాంబశివరావు రానున్నారు. డీఎల్‌పీవో స్మిత రాజేంద్రనగర్ శిక్షణ కేంద్రానికి బదిలీ కాగా, ఇక్కడికి సూర్యాపేట నుంచి విప్పాల సాంబిరెడ్డి బదిలీపై రానున్నారు.

- రేషన్ కార్డే ప్రామాణికం అంటున్న అధికారులు
- పదేళ్లుగా కొత్త కార్డులు ఇవ్వని సర్కారు
- కార్డులు లేని కుటుంబాలు వేలల్లో...
- వర్తిస్తుందా... వర్తించదా?
- పథకాల అమలుకు ఇంటింటి సర్వే
- వివరాల ధ్రువీకరణకు పరిశీలనా సిబ్బంది
- వివరాల్లో తప్పులు ఉంటే సవరించి యాప్‌లో నమోదు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీ పథకాల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం కింద ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీని అమలు చేస్తుండగా, మరో రెండు గ్యారంటీలను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అమలుకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అర్హులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ రెండు గ్యారంటీలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు తెల్లరేషన్ కార్డు వివరాలను తీసుకోవాలన్న ఆదేశాలతో రేషన్‌కార్డు లేని కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు స్పష్టత రావడంతో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ రెండు గ్యారంటీలు వర్తించే అవకాశం లేదనే విషయం స్పష్టమవుతుంది.



గ్యారంటీ ఉందా?

గృహజ్యోతి, మహాలక్ష్మి లబ్ధిదారుల్లో గుబులు

ఆశగా ఎదురు చూపులు



వికారాబాద్,(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/తాండూరు, ఫిబ్రవరి 13: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో భారీ సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఆరు గ్యారంటీలకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న తెల్లరేషన్ కార్డుదారులు మాత్రమే అర్హులనేది ప్రకటించకపోవడంతో పేదల నుంచి ధనవంతుల వరకు, ప్రైవేట్ ఉద్యోగుల నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వరకూ అందరూ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాలకు తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్న నేపథ్యంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి తెల్లరేషన్ కార్డు లేని కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్తరేషన్ కార్డుల కోసం జిల్లాలో వేలాది పేద కుటుంబాలు సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నాయి. ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాలే దరఖాస్తు చేసుకోవాలనేది స్పష్టత ఇవ్వకుండా.. తీరా దరఖాస్తు చేసుకున్న తరువాత తెల్లరేషన్ కార్డును అర్హతగా గుర్తించేలా ఆదేశాలు జారీ చేయడం ఎంత వరకు సమంజసమని రేషన్ కార్డులు లేని కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. తెల్లరేషన్ కార్డును అర్హతగా ప్రామాణికంగా తీసుకోనున్నట్లు స్పష్టత రావడంతో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ రెండు గ్యారంటీలు వర్తించే అవకాశం లేదనేది తెలుస్తోంది. తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాలకే ఈ రెండు పథకాలు వర్తించనున్నాయనేది స్పష్టమవుతోంది.



కొత్త పింఛన్ల మంజూరు ఎప్పుడో?

గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసకున్నారు. అయితే నెలలు కాదు... సంవత్సరాలు ఎదురు చూశారు. మరి కొందరైతే పింఛన్ కోసం ఎదురు చూశారు. కనీసం ఈ సర్కారైనా పింఛన్ తొందరగా మంజూరు చేయకపోతుందా అని ఆశగా ఉన్నారు. కొత్త ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీల్లో భాగంగా పింఛన్లకు సంబంధించి చేయూత పథకం కూడా ఒకటి. అర్హులైన వారు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి ముందుగా కొత్త పింఛన్లు మంజూరు ఇవ్వాలని పలువురు వేడుకుంటున్నారు. గడిచిన రెండేళ్ల నుంచి దరఖాస్తులు స్వీకరించినా మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పింఛన్ పథకాన్ని చేయూతగా మార్చింది. ఉమ్మడి జిల్లాలో గతయేడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి ఆర్జీలు స్వీకరించారు. పింఛన్ కోసమే వేలాది దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా మంజూరు చేస్తే వారికి చేయూత ఇచ్చినట్టవుతుంది.

ముందుగానే రేషన్‌కార్డులు ఇస్తే..

కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలకు తెల్ల రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం భావించి ఉంటే, ముందుగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేసిన తరువాతనే రూ.500లకు వంటగ్యాస్, 200యూనిట్ల ఉచిత కరెంట్ పథకాల అమలుకు లబ్ధిదారులను ఎంపిక ప్రక్రియ చేపట్టి ఉంటే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఇంటింటికీ వెళ్లి విద్యుత్ మీటర్ నెంబర్, యజమాని వివరాలు, ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు నంబరు కూడా తప్పనిసరిగా నమోదు చేస్తుండడంతో తాము రూ.500లకు వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలు తమకు వర్తించవేమోనన్న ఆందోళన రేషన్‌కార్డులు లేని కుటుంబాల్లో వ్యక్తమవుతోంది. వివాహమై కొత్తగా కుటుంబాలు ఏర్పాటైన వారితో పాటు రేషన్ కార్డులు లేని వేలాది కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

దరఖాస్తులు	ఆహార భద్రతా కార్డులు	వంటగ్యాస్ సిలిండర్ (మహాలక్ష్మి)	ఉచిత విద్యుత్ (గృహజ్యోతి)	వంట గ్యాస్ (గృహ కనెక్షన్లు)
వికారాబాద్	2,41,185	2,27,773	2,09,560	2,03,123
రంగారెడ్డి	5,24,976	4,32,676	3,99,866	12,30,000

రెండు గ్యారెంటీల అమలుకు కసరత్తు

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం కింద ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సాయం రూ.10లక్షల వరకు పెంపు హామీలను అమల్లోకి వచ్చాయి. మరో రెండు గ్యారంటీలను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్ హామీతో పాటు మహాలక్ష్మి పథకం రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసే విధంగా సంబంధిత శాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ రెండు పథకాలకు తెల్ల రేషన్ కార్డు ఉన్న వారినే అర్హులుగా పరిగణిస్తున్నారు. వంటగ్యాస్ కనెక్షన్ దారుల వివరాలు ధ్రువీకరించుకునేందుకు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే అర్హులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌తో పాటు రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబంధించి గతనెలలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని ఆ వివరాలను ప్రజాపాలన పోర్టల్‌లో నమోదు చేసిన విషయం తెలిసిందే.

యాప్‌లో వివరాల నమోదు

రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ పథకం కోసం వికారాబాద్ జిల్లాలో 2,27,773 మంది దరఖాస్తు చేసుకోగా, రంగారెడ్డి జిల్లాలో4,32,676 దరఖాస్తులు వచ్చాయి. 200యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం వికారాబాద్ జిల్లాలో 2,09,560 మంది దరఖాస్తు చేసుకోగా, రంగారెడ్డి జిల్లాలో 3,99,866 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అర్హుల వివరాలను నమోదు చేస్తున్నారు. కరెంట్‌బిల్లు, తెల్ల రేషన్‌కార్డు (ఆహార భద్రతా కార్డు), ఆధార్, మొబైల్ నంబర్ వివరాలను ఇంటింటికీ తిరిగి నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఆరు రోజుల కిందట ప్రారంభం కాగా, రూ.500లకు వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ పథకం కోసం గురువారం నుంచి వివరాల ధ్రువీకరణ, తప్పుల సవరణ ప్రక్రియ చేపడుతున్నారు. ఇంటింటికీ తిరిగి వివరాలను ధ్రువీకరించుకునేందుకు గ్రామాల్లో, మునిసిపాలిటీల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి అన్ని వివరాలను సరిచూసుకుని తప్పులు ఉంటే సరిచేసి నమోదు చేస్తున్నారు. నమోదు ప్రక్రియ పూర్తయిన తరువాత 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ పంపిణీ పథకాలను అమల్లోకి తీసుకురానున్నారు.

దరఖాస్తుల వెల్లువ

వికారాబాద్ జిల్లాలో 2,03,123, రంగారెడ్డి జిల్లాలో 12,30,000 వేల గృహ వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ కనెక్షన్లలో సాధారణ కనెక్షన్లు వికారాబాద్ జిల్లాలో 1,58,121 ఉండగా, దీపం పథకం కనెక్షన్లు 26,502, ఉజ్వలపథకం కనెక్షన్లు 18,300 ఉన్నాయి. 21 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా జిల్లాలో 70 వేల వరకు సిలిండర్ల డిమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, జిల్లాలో గృహసంబంధమైన విద్యుత్ కనెక్షన్లు 2,39,409 ఉన్నాయి. ఈ కనెక్షన్లలో 1,96,227 మంది కనెక్షన్‌దారులు 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్నట్లు టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు గుర్తించారు. వికారాబాద్ నియోజకవర్గంలో 71,692, పరిగి నియోజకవర్గంలో 37,815, కొడంగల్ నియోజకవర్గంలో 24,042, తాండూరు నియోజకవర్గంలో 62,678 కనెక్షన్ దారులు 200యూనిట్లలోపు కరెంట్ వినియోగిస్తున్నట్లు తేల్చారు. 200యూనిట్ల ఉచిత కరెంట్ కోసం జిల్లాలో 2,09,560 మంది దరఖాస్తు చేసుకోగా, టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారుల లెక్కల ప్రకారం 1,96,227మంది అర్హులు ఉన్నారు. రూ.500 లకు వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడితేనే అర్హుల ఎంపిక విషయంలో స్పష్టత రానుంది.

అగ్నికీలల్లో హరితహారం చెట్లు

బషీరాబాద్, ఫిబ్రవరి 13: బషీరాబాద్-తాండూరు రోడ్డు మార్గంలోని కొర్విచెడ్ ఘనిగ్రామంలో హరితహారం చెట్లకు మంగళవారం మంటలంటుకున్నాయి. ఈ విషయమై రోడ్డుమార్గం గుండా వెళ్తున్న కొందరు ఎంపీడీవో రమేష్‌కు సమాచారం అందించారు. ఈ క్రమంలో ఎంపీడీవో వెంటనే గ్రామ కార్యదర్శి రాజును అప్రమత్తం చేసి ఘటన స్థలానికి పంపించి మంటలర్పించేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన పొలంలో చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి హరితహారం చెట్లకు వ్యాపించాయి.



గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకుసాగాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. మండలంలోని ఎదులాబాద్‌లో మల్లారెడ్డి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆయన నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులుక్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. క్రీడలతో ఏకాగ్రత, శారీరకదారుఢ్యం పెంపొందుతుందన్నారు. క్రీడలు జీవితంలో భాగమని, క్రీడలకు కొంత సమయం కేటాయించాలని కోరారు. ప్రతీరోజు గంటసేపు వ్యాయమం చేయాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. మల్లారెడ్డి క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన జీఎస్ఆర్ గుర్రంగూడ జట్టుకు రూ.50వేల నగదుతో పాటు కప్‌ను, ద్వితీయస్థానంలో నిలిచిన స్పైవరల్డ్ ఎఎస్‌రావు జట్టుకు రూ.25వేల నగదుతో పాటు కప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి క్రికెట్ పోటీల నిర్వహకుడు ఎర్రోళ్ళ శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, నాయకులు కానుగంటి శ్రీనివాస్, అల్లం శంకర్, కె.చిరంజీవి, అబ్బోల్ల నాగేష్, ప్రవీణ్ రెడ్డి, మంకం రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న మల్లారెడ్డి

చీమలదరి దేశానికే ఆదర్శం

- కేంద్ర టెలి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హా చౌహన్

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 13 : టెలికమ్యూనికేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవడంలో మోమిన్‌పేట్ మండలం, చీమలదరి గ్రామం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హా చౌహన్ అన్నారు. జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు పొందిన చీమలదరి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో, టెలికమ్యూనికేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవడంలో చీమలదరి గ్రామం దేశంలో అన్ని గ్రామాల కంటే ఎంతో ముందున్నదని అభినందించారు.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో టెలి కమ్యూనికేషన్ రంగం అద్భుతంగా విస్తరిస్తూ గణనీయంగా అభివృద్ధి చెందిందని, దీనికి ఉదాహరణ చీమల్‌దరి గ్రామమేనని ఆయన గుర్తు చేశారు. చీమల్‌దరి పాఠశాలలో బీఎస్ఎన్ఎల్ ఆన్‌లైన్ సేవల ద్వారా విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించడం శుభసూచకమన్నారు. డిజిటల్ పాఠాలు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా స్మార్ట్ బోర్డుపై బోధించడం అభినందనీయమంటూ ఆయన ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్ సేవలు విస్తృతంగా వినియోగించుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామంలో ఇంటింటికీ బీఎస్ఎన్ఎల్ ద్వారా వైఫై సేవలు అందించేందుకు తాజా మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి చేసిన కృషిఎంతో అభినందనీయమన్నారు. తన సొంత డబ్బులు రూ.50లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భారత్‌నెట్ ప్రాజెక్టు సహాయంతో గ్రామ పంచాయతీలో స్మార్ట్ విలేజ్‌గా 108 ఇళ్లకు ఇంటర్నెట్ కనెక్షన్‌లు తీసుకున్నారని తాజా మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని గ్రామాలను టెలి కమ్యూనికేషన్ పరిధిలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు అంగన్‌వాడీ భవనం, పాఠశాలలను సందర్శించిన కేంద్ర మంత్రి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో, పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలో ఏయే సేవలు అందిస్తున్నారనేది ఆయన స్వయంగా పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలో పర్యటించిన ఆయన గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి, ఆర్డీవో విజయకుమారి, బీఎస్ఎన్ఎల్ తెలంగాణ జనరల్ మేనేజర్ శ్రీనివాసచారి, ఎం.నర్సింహారెడ్డి, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంఈవో గోపాల్, ఎంపీవో యాదగిరి, కార్యదర్శి సుగుణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి దేవ్‌సింహ్ చౌహన్

గ్రామ పంచాయతీకి జాతీయ అవార్డు

కాగా, చీమలదరి పంచాయతీకి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం-2023 ప్రకటించారు. ఈ పురస్కారాల్లో భాగంగా 9 కేటగిరిల్లో 27 అవార్డులు ప్రకటించగా, వాటిలో చీమలదరి పంచాయతీ ఒకటి. ఏటా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ ఉత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలకు ప్రోత్సాహకంగా అవార్డులు అందిస్తోంది. ఈ క్రమంలో చీమలదరి పంచాయతీకి జాతీయ స్థాయిలో రెండోర్యాంకు ప్రకటించారు.

- సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం
- మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలనే లక్ష్యం

వికారాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ.59.03 కోట్లతో 766 సీసీ రోడ్లు, మురుగు కాలువల (సైడ్‌డ్రైన్) నిర్మాణం పనులు చేపట్టనున్నారు. వికారాబాద్ నియోజకవర్గం పరిధిలో రూ.15.98 కోట్లతో 206 పనులు చేపట్టనున్నారు. తాండూరు నియోజకవర్గంలో రూ.13 కోట్లతో 223 పనులు, పరిగి నియోజకవర్గంలో రూ.10.05 కోట్లతో 209 పనులు, కొడంగల్ నియోజకవర్గం పరిధిలో రూ.20 కోట్లతో చేపట్టనున్న 128 పనుల ప్రతిపాదనలకు పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాకు మంజూరైన సీసీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం పనులను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.

మంజూరైన పనుల వివరాలు

మోమిన్‌పేట మండలంలో 41పనులు చేపట్టేందుకు రూ.3 కోట్లు మంజూరు కాగా, ధారూరు మండలంలో 48 పనులు చేపట్టేందుకు రూ.2.50కోట్లు మంజూరుచేశారు. వికారాబాద్ మండలంలో 33 పనులు చేపట్టేందుకు రూ.3 కోట్లు, మర్పల్లి మండలంలో రూ.2.63 కోట్లతో 33 పనులు, బంట్వారం మండలంలో రూ.2.85 కోట్లతో 30 పనులు, కోట్‌పల్లి మండలంలో రూ.20 కోట్లతో 24 పనులు మంజూరయ్యాయి. తాండూరు మండలంలో రూ.30 కోట్లతో 52 పనులు, యాలాల్ మండలంలో రూ.30 కోట్లతో 57పనులు, పెద్దేముల్ మండలంలో రూ.30 కోట్లతో 53 పనులు, కోట్‌పల్లి మండలంలో రూ.10 కోట్లతో 15 పనులు, బషీరాబాద్ మండలంలో రూ.30 కోట్లతో 46 పనులు చేపట్టనున్నారు. పరిగి మండలంలో రూ.2.20 కోట్లతో 46పనులు, పూడూరు మండలంలో రూ.2.50 కోట్లతో 51 పనులు, దోమ మండలంలో రూ.2.53 కోట్లతో 52 పనులు, కులకచర్ల మండలంలో రూ.20.9 కోట్లతో 44 పనులు, చౌడాపూర్ మండలంలో రూ.73 లక్షలతో 16 పనులు మంజూరయ్యాయి. చేపట్టనున్నారు. బొంరాస్‌పేట్ మండలంలో రూ.7.20 కోట్లతో 55 పనులు, దౌల్తాబాద్ మండలంలో రూ.6.05 కోట్లతో 36 పనులు, కొడంగల్ మండలంలో రూ.6.75 కోట్లతో 37 పనులు చేపట్టనున్నారు.



59.03 కోట్లు

జిల్లాలో ఉపాధి హామీ పనులకు నిధులు మంజూరు




కొత్తపల్లిలో మృతి చెందిన గొర్రెలు

కుక్కల దాడిలో 40 గొర్రెల మృతి

దోమ, ఫిబ్రవరి 13: వికారాబాద్ జిల్లా, పరిగినియోజకవర్గం దోమ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వీధి కుక్కల దాడిలో సోమవారం రాత్రి 40 గొర్రెలు మృతి చెందగా ఐదు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కుంట మల్లేశం, బొంగు లింగయ్యలు పొలం దగ్గర ఏర్పాటు చేసిన కొట్టంలో గొర్రెలను ఉంచారు. రాత్రి కాపర్లు నిద్రిస్తున్న సమయంలో గొర్రెలపై వీధి కుక్కల దాడి చేయగా 40 మృతి చెందాయి. మిగతా ఐదు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. రూ.3 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితులు వాపోయారు., ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరారు.





కొడంగల్‌లో మినీ హజ్‌హౌస్, షాదీఖానా నిర్మించాలి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13: కొడంగల్‌లో మినీ హజ్‌హౌస్, షాదీ ఖానా నిర్మాణం, కొడంగల్ పట్టణ శివారులోని షేక్‌సాహెబ్ పహడి దర్గా అభివృద్ధికి నిధులు మంజూర్ చేయాలని మైనార్టీ నాయకులు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం కడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేకాధికారికి మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదేవిధంగా కొడంగల్ శివారులో కోస్గి రోడ్డులో గల షేక్ సాహెబ్ పహాడి దర్గాలో సౌకర్యాల లేమితో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. దర్గాకు వెళ్లేందుకు రోడ్డు తదితర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. దర్గాకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యాల కోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఆసీఫ్‌ఖాన్, ఎండీ.షాకీర్, సయ్యద్ అశ్వాఖ్, హమీద్‌అలీ, ఎండీ.రహీం, మౌలానా హఫీజ్ అబ్దుల్ కరీం, ఖాసీం, రుక్మోద్దీన్, సయ్యద్ ఇసాక్‌పాష, షేక్ సాబేర్, యం.ఎ.కరీం, ఎండీ.ఖదీర్ పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

దౌల్తాబాద్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 87మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా తహసీల్దార్ విజయ్‌కుమార్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, నాయకులు వీరన్న, వెంకట్‌రెడ్డి, మంజుల, దస్తప్ప, సాయిలు, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి సన్మానం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13: హస్నాబాద్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు లక్ష్మి ఇటీవల ఢిల్లీలో ప్రధాని చేతుల మీదుగా జాతీయ ఉత్తమ పారిశుధ్య కార్మికురాలిగా అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డబ్ల్యూఈసీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రిన్సిపాల్ రాజారాం, అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.


లక్ష్మిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సామాజిక దృక్పథంతో ముందుకు సాగాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13: సమాజంలో ప్రతీపౌరుడు సామాజిక దృక్పథంతో ముందుకు సాగాలని ప్రముఖ గేయరచయిత డాక్టర్ జయరాజ్ తెలిపారు. అంకుషాపూర్ ప్రిన్స్టన్ కళాశాల ఆవరణలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం కళాశాలలో మంగళవారం 'ప్రకృతి-పాట' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాధ్యతయుతంగా నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువినప్పుడే విజయాలు సొంతమవుతాయన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కో-ఆర్డినేటర్ నాగకల్యాణి, ప్రిన్సిపల్స్ హెచ్. రాధిక, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, అధ్యాపకులు పద్మమ్మ, దాసోజు పద్మావతి, సౌజన్య, విద్యార్థినులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న గేయరచయిత డాక్టర్ జయరాజ్


ప్రకృతిని కాపాడుదాం

దోమ, ఫిబ్రవరి 13: ప్రకృతిని కాపాడుదాం.. అభివృద్ధిని సాధించుకుందామని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాం రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సంతలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అనంతరం వ్యాపారులు, ప్రజలకు ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్, కార్యదర్శి నర్సింహులు, నాయకులు బందెయ్య, ఆంజనేయులు, నాగేంద్రం, మల్లేశం, నిరంజన్, రమేశ్ పాల్గొన్నారు.


సంతలో బ్యాగులు పంపిణీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి











పాఠశాల భవనంపై సెల్‌టవర్ నిర్మాణం

● మున్సిపల్ కార్యాలయం ఎదుట కాలనీవాసుల ధర్నా
● అనుమతులు ఎలా ఇస్తారంటూ నిలదీత


ధర్నా చేస్తున్న కాలనీవాసులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13: ఇళ్లమధ్య పాఠశాల భవనంపై నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌ఎఫ్‌సీనగర్ కాలనీవాసులు మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. విద్యార్థులు, కాలనీవాసులపై రేడియేషన్ ప్రభావం పడే ప్రమాదుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజులుగా సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆందోళనలు చేయడంతో పాటు అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సెల్ టవర్‌పై మున్సిపల్ అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినా అందులో ఎక్కడా పాఠశాల భవనంపై సెల్ టవర్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొనకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా పొందిన సెల్‌టవర్ నిర్మాణ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నార్ల మల్లేష్ యాదవ్, చల్లా చిత్తరంజన్‌రెడ్డి, విజయ్, నారయణ రెడ్డి, బంగారుబాబు, సామల శ్రీనివాస్, గౌరయ్య, మణెమ్మ పాల్గొన్నారు.

ఇసుక పర్మిట్ల పరిశీలన

● నెంబర్లులేని ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ● తాండూరు మైన్స్ ఏడీ శ్యామెల్ జాకబ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరురూరల్, ఫిబ్రవరి 13: అనుమతులు లేకుండా ఇసుక తరలింపుపై అధికారులు స్పందించారు. 'ఇసుక అక్రమాలకు కొత్త దారులు' శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి తాండూరు మైన్స్ ఏడీ శ్యామెల్ జాకబ్ స్పందించి ఇసుక పర్మిట్లను పరిశీలించారు. తాండూరు మండలం ఖాంజాపూర్ గ్రామ శివారులోని కాగ్నా నది నుంచి తాండూరు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం కొంతమంది ఇసుక వ్యాపారులు సోమవారం 36ట్రిప్పుల ఇసుకను అనుమతులు పొంది తరలిస్తున్నారు. అయితే వీరిలో కొందరికి అక్రమార్కులు ట్రాక్టర్ ట్రాలీ నెంబర్ టీఎస్-34టీ9739ల పేరిట అనుమతులు పొంది మరో ట్రాక్టర్ ట్రాలీకి అదే నెంబర్ స్టిక్కర్ అతికించి ఒక ట్రాలీ ఇసుక రైల్వే స్టేషన్ తరలిస్తుండగా, ఇతర చోట్ల డంప్ చేసి ఇసుకను అమ్ముకుంటున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో తాండూరు మైన్స్ ఏడీ శ్యామెల్ జాకబ్ మండలంలోని ఖాంజాపూర్ గ్రామానికి వెళ్లి పర్మిట్లను పరిశీలించారు. గ్రామానికి వెళ్లి మైన్స్ ప్రతినిధి భరత్‌రెడ్డి 42ట్రిప్పులకు పర్మిట్లు జారీ చేయగా, వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే కొందరు ట్రాక్టర్లకు నెంబర్లు లేకపోవడంతో ఇక నుంచి ట్రాక్టర్‌కు ఇంజన్‌తోపాటు వెనుక ఇసుకను తీసుకెళ్లే ట్రాలీకి నెంబర్లు వేయించుకుని తరలించాలని ఆదేశించారు. అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ప్రాంతానికి పర్మిట్ పొందారో అదేప్రాంతంలో ఇసుక డంప్ చేయాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా డంప్ చేస్తే అట్టివారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై ట్రాక్టర్‌ను చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం పర్మిట్ల జారీలో సరైన ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఇసుక అక్రమార్కులు కొత్తదారులు వెతుకుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయంలో అటు పోలీసులు, ఇటు మైన్స్ రెవెన్యూ అధికారులు ఇసుక తరలింపు ట్రాక్టర్లపై నిఘా పెట్టాలని ఖాంజాపూర్ గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.


ఖాంజాపూర్ శివారులో
ఇసుక పర్మిట్లను తనిఖీ చేస్తున్న మైన్స్ ఏడీ శ్యామెల్ జాకబ్

సుద్ద అక్రమ తరలింపునకు చెక్


మైన్స్ సిబ్బంది నిలిపివేసిన టిప్పర్లు

పెద్దేముల్, ఫిబ్రవరి 13: అక్రమంగా సుద్ద తరలింపునకు మైన్స్ అధికారులు చెక్ పెట్టారు. ఇన్నాళ్లు చూసీచూడనట్లు వ్యవహరించిన అధికారులు అక్రమాలపై సీరియస్‌గా తీసుకున్నారు. సుద్ద తరలిస్తున్న ప్రతీలారీలో రాయల్టీలను తనఖీచేస్తున్నారు. మండలంలోని మారెపల్లి, జనగాం, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్, రుద్రారం గ్రామాల పరిధిలో సుద్ద నిక్షేపాలు ఉన్నాయి. వాటిని తవ్వి తరలించేందుకు ప్రభుత్వం అనుమతులు తప్పనిసరి. అయితే ఇటీవల గనుల తవ్వకానికి లీజులు రావడం కష్టతరంగా మారింది. దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం నుంచి లీజులు రాకపోవడంతో కొంతమంది అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు. మరికొందరు ఐదెకరాల భూమి ఉంటే ఉంటే ఒకటి, రెండెకరాలకు లీజులు తీసుకుని అదే లీజుపై మొత్తం తవ్వుతున్నారు. తవ్విన గనులను మట్టితో మూసేసి ముందుకు తవ్వుతూ వెలుతున్నారు. అయితే లీజులు లేని గనుల్లో తవ్విన సుద్దను స్థానికంగా ఉండే ఫ్యాక్టరీలకు తరలిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లీజులు ఉన్నవారి వద్ద రాయల్టీలు తీసుకుని ఒక రాయల్టీపై నాలుగైదు ట్రిప్పుల సుద్దను తరలిస్తుంటారు. సుద్ద తరలిస్తున్న లారీలపై నజర్ లేకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆటగా సాగింది. దీంతో మైన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్తుండడంతో రెండు రోజులుగా మైన్స్ సిబ్బంది రోడ్లపై నిలబడుతున్నారు. సుద్దతో వెళ్తున్న ప్రతీటిప్పర్‌ను ఆపి రాయల్టీలు తనిఖీ చేస్తున్నారు. అయినా ఎక్కడో ఒక చోట అక్రమ తరలింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మైన్స్ సిబ్బంది సోమవారం మధ్యాహ్నం సుద్దతో వెళ్తున్న టిప్పర్‌ను నిలిపి రాయల్టీని పరిశీలించగా నిర్ణీత గడువు దాటిపోయి ఉండడంతో టిప్పర్లను అక్కడే నిలిపివేయించారు. ఉదయం 10.15గంటలకు తీసుకున్న రాయల్టీతో మధ్యాహ్నం 1.15లోపు సుద్దను తరలించేందుకు అనుమతి ఉంది. కానీ 1.30 గంటలకు లారీ రోడ్డుపైకి రావడంతో తనిఖీచేసిన సిబ్బంది గుర్తించి టిప్పర్లను నిలిపివేశారు. తిరిగి కొత్తగా రాయల్టీలు తీసుకువస్తేనే వదిలేస్తామని చెప్పడంతో వాటికి సంబంధించిన వ్యాపారులు తిరిగి కొత్తగా రాయల్టీలు తీసుకువచ్చి చూపడంతో సుద్ద టిప్పర్లను వదిలేశారు. దీంతో సుద్ద వ్యాపారుల్లో కొంత గుబులు మొదలైంది. అధికారులు తనిఖీలను కొనసాగిస్తే ప్రభుత్వం ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మట్టి రోడ్లకు మహర్దశ

● బషీరాబాద్‌కు
రూ.3 కోట్ల ఉపాధి నిధులు మంజూరు

బషీరాబాద్, ఫిబ్రవరి 13: గ్రామాలు, గిరిజన తండాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. మండలానికి 2023-24 సంవత్సరానికి గాను మెటీరియల్ కంపోనెంట్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.3కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మట్టి రోడ్లకు మహర్దశ వచ్చింది. ఈ నిధులతో 35గ్రామ పంచాయతీల్లో అంతర్గత మట్టి రోడ్లను సీసీరోడ్లుగా మార్చనున్నారు. పంచాయతీల వారీగా నిధుల మంజూరీకి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బషీరాబాద్ గ్రామ పంచాయతీకి రూ.40లక్షలు, మైల్వార్, ఎక్మాయి, నవాంద్గీ, క్యాద్గీరా, జీవన్గి, దామర్‌చెడ్, వాల్యానాయక్ తండా, కొర్విచెడ్, కొర్విచెడ్‌ఘని, నవాల్గ, భోజ్యానాయక్‌తండా, బాబునాయక్‌తండా, పర్వత్‌పల్లి, మర్పల్లి, మంతట్టి, రెడ్డిఘణాపూర్, కాశీంపూర్, కుప్పన్‌కోట్ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున, కంసాన్‌పల్లి(బి), మంతన్‌గౌడ్, మంతన్‌గౌడ్‌తండా, అల్లాపూర్, కొత్లాపూర్, మాసన్‌పల్లి, నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్, మాల్కన్‌గిరి, బద్లాపూర్, బద్లాపూర్‌తండా, గొట్టిగకలాన్, గొట్టిగఖుర్దు, కంసాన్‌పల్లి(ఎం) పంచాయతీలకు రూ.5లక్షల చొప్పున, నంద్యానాయక్‌తండా, జమ్లానాయక్‌తండాలకు రూ2.50 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వారం రోజుల్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే ఆవకాశం ఉన్నందున కాంట్రాక్టర్లు పనులను వెంటనే ప్రారంభించి మార్చి 15లోపు సీసీరోడ్ల నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంటుందని ఏఈ వంశీకృష్ణ తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13: మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, ఆర్జీకేకాలని, నారపల్లి, పోచారంలో రూ.1.25కోట్లతో నిర్మించనున్న సీసీ, బీటీ, భూగర్భ డ్రైనేజీల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు సాయిరెడ్డి, హిమ, లక్ష్మి, సరిత, సుదాలక్ష్మి, పోచమ్మ, శ్రీలత, బద్దం మమత, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, ఏఈ నరేష్, నాయకులు మందడి సురేందర్‌రెడ్డి, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న
చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్, కమిషనర్

చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం తాగించాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 13 : 9 నెలల నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం తాగించాలని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్‌తో కలిసి ఆర్డీవో సాయిరాం చిన్నపిల్లలకు ఏ విటమిన్ ద్రావణం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణంతో రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని అన్నారు. విటమిన్ లోపం కారణంగా రేచీకటి సమస్య వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుందని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు ద్రావణం తాగిస్తున్న ఆర్డీవో సాయిరాం, తదితరులు

మేలురకం పశుగ్రాసాన్ని పండించాలి : ఏడీఏ


పశు వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ వసంతకుమారి, తదితరులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13: మేలురకం పశు గ్రాసాన్ని పండించాలని పాడి ఉత్పత్తులను పెంచుకోవాలని ఇబ్రహీంపట్నం పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పి.వసంతకుమారి రైతులకు సూచించారు. ఇబ్రహీంపట్నం పరిధి రాయపోల్ గ్రామంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ, సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న ఈ ప్రాంతంలో పాడి ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు. హైదరాబాద్ మహానగరానికి పాల ఉత్పత్తులు సరఫరా చేసుకునే అవకాశమున్నందున పాడి పరిశ్రమను మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు. శిబిరంలో 42 పశువులకు చూడి పరీక్షలు, 25 పశువులకు గర్భసంబంధ శస్త్ర చికిత్సలు చేశారు. అలాగే 40 దూడలకు నట్టల నివారణ మందులు, 35 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. ఎంపీటీసీలు గంగిరెడ్డి జ్యోతి భాస్కర్‌రెడ్డి, అచ్చన శ్రీశైలం, ఎలిమినేడు, మంచాల పశు వైద్యాధికారులు డా.సురేష్‌బాబు, డా.సుధ, సిబ్బంది కవిత, పురుషోత్తం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యాదయ్యకు జడ్పీటీసీ పరామర్శ

షాబాద్, ఫిబ్రవరి 13 : కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే యాదయ్యను ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అవినాష్ రెడ్డి సతీమణి సాన్విరెడ్డి, మొయినాబాద్ జడ్పీటీసీ శ్రీకాంత్ ఉన్నారు.



అవినీతికి పాల్పడితే ఉపేక్షించం


మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 13 : మహేశ్వరం నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు వృత్తి ధర్మాన్ని మరిచి పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు అవినీతి, అక్రమాలకు పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించబోదని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కొందరు అధికారులు అవినీతి, అక్రమాలకు తెరలేపారని, అలాంటి వారిని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఎక్కడకు పంపాలో.. అక్కడికే పంపుతుందన్నారు. పేద ప్రజలు వివిధ రకాల పనుల కొరకు కార్యాలయాలకు వస్తే వారిని పక్కకు పెట్టి బడాబాబుల పనులను చట్టవిరుద్ధంగా చేసి పెట్టిన అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని, అలాంటి వారి జాబితా తయారుచేసి స్థాన చలనం కల్పిస్తున్నారని తెలిపారు. అవినీతి, అక్రమాలు నిరూపితమైతే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రణాళికలు తయారు చేసిందన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు అధికారులపై ప్రత్యేక నిఘా పెట్టిందన్నారు. ధరణిని అడ్డం పెట్టుకొని రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్ చేసి నిబంధనలు తుంగలో తొక్కారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకునేందుకు రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారన్నారు. ధరణిని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ పెద్దలకు అప్పనంగా అప్పజెప్పిన అవినీతి అధికారులను ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టేదిలేదని కేఎల్లార్ హెచ్చరించారు.

భట్టికి కేఎల్లార్ పరామర్శ

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు మృతిపట్ల కేఎల్లార్ సంతాపం తెలిపారు. ఈమేరకు నగరంలోని ఏఐజీ ఆస్పత్రిలో భట్టి విక్రమార్కను కలిసి వెంకటేశ్వర్లు మృతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహానికి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నం ఏసీపీగా పీటర్ వత్సల రాజు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13 : ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు సైబరాబాద్ కమిషనరేట్ పరిధి శంషాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) డీఎస్పీ కె.పీటర్ వత్సల రాజును నియమిస్తూ డీజీపీ ర వి గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో
'ఎస్‌ఆర్ శ్రీగాయత్రి' విద్యార్థుల ప్రభంజనం

● 99 ప్లస్ స్కోర్ సాధించిన 18మంది విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థ యాజమాన్యం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13: ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్‌లో మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆదిభట్ల ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యా సంస్థలకు చెందిన 18 మంది విద్యార్థులు 99 ప్లస్ స్కోర్ సాధించినట్లు ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యా సంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డిలు తెలిపారు. ఈ ఫలితాలు పొందిన విద్యార్థులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)లో ప్రవేశానికి అర్హత సాధించినట్లు వారు తెలిపారు. కాగా, జేఈఈ మెయిన్స్‌లో మంచి స్కోర్ సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఫలితాల్లో కళాశాలకు చెందిన డి.మనీష్, టి.తేజస్వి, దిపాన్స్‌రెడ్డి, నిహాల్‌శ్రీవాత్సవ్, శ్రీరామ్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, వి.ప్రతీక్, సాయిప్రణతి, సూర్యతేజ, చెన్న కేశవరెడ్డి, ఎం.శ్రీవల్లి, చంద్రదీప్, సుబ్రమణ్యఆకాష్, వైశాలి, కమలవర్ధన్, ప్రగ్నతేజ, రాజీవ్, సాయియోగాభిలాష్. మొత్త 18 మంది విద్యార్థులు 99 ప్లస్ స్కోరు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యా సంస్థల డీజీఎం వాసుదేవ రెడ్డి, అకడమిక్ డీన్‌లు కె.శ్రీనివాస్, భరత్‌రెడ్డి, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సన్నద్ధమవ్వాలి


మాట్లాడుతున్న డీఈవో

షాద్ నగర్, ఫిబ్రవరి 13 : పరీక్షలు అనగానే ఆందోళనకు గురికావద్దని, రంగారెడ్డి జిల్లా విద్యా శాఖ అధికారి సు శీంద ర్‌రావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని రాగూర్ హైస్కూల్లో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు చైతన్యం, అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివితే మెరుగైన ర్యాంకులు సొంతం అవుతాయని, పరీక్షలు అనగానే కంగారు పడేవారు అప్పటివరకు చదివింది కూడా మరిచిపోతారని సూచించారు. తప్పకుండా మెరుగైన ర్యాంకు సాధిస్తామన్న ధైర్యంతో ముందుకు సాగితే సులువుగా పరీక్షలు రాయగలుగుతారని తెలిపారు. ఎంఈవోలు శంకర్ రాథోడ్, కృష్ణారెడ్డి, మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు పరిహారం అందించాలి'

కడ్తాల్, ఫిబ్రవరి 13: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలని ఎమ్మార్పీఎస్ కడ్తాల మండల ఇన్‌చార్జి రమేశ్ మాదిగ కోరారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు పరిహారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేశ్ మాదిగ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు న్యాయం కోసం ప్రత్యేక న్యాయ వాదులను ఏర్పాటు చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బాధితుల బడ్జెట్‌ను దారిమళ్లించి బాధితులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు.

నల్లగొండకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



మేడ్చల్: నల్లగొండ సభకు బయల్దేరుతున్న బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్ ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కృష్ణా జలాలపై తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రజలకు తెలిపేందుకు నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన బహిరంగసభకు మేడ్చల్ నుంచి బీఆర్ఎస్ నేతలు తరలివెళ్లారు. ఆపార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డిల ఆధ్వర్యంలో మేడ్చల్ నుంచి బీఆర్ఎస్ నాయకులు బస్సుల్లో భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు యూనిస్‌పాషా, గౌస్ పాషా, సత్యనారాయణ, ఉపసర్పంచ్ నరేందర్, నాయకులు మహేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: నల్లగొండ బహిరంగ సభకు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు బస్సుల్లో తరలివెళ్లారు. మండలంలోని 11 గ్రామాల నుంచి దాదాపు 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ పార్లమెంట్ ఇన్‌చార్జి చామకూర భద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధానకార్యదర్శి కొండల్‌రెడ్డి, ధర్మారెడ్డి, నాయకులు అయిలయ్య, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మన్, జంగయ్య, గోపాల్‌రెడ్డి, నాగరాజు తరలివెళ్లారు.

నవాబుపేట: కృష్ణానది జలాలను కేంద్రానికి అప్పగించొద్దని మంగళవారం నల్లగొండ లో తలపెట్టిన బహిరంగ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నవాబుపేట మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో బహిరంగసభకు బయలుదేరి వెళ్లారు.

తాండూరురూరల్: నల్లగొండలో తలపెట్టిన సభకు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు మండల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని తనంతో కృష్ణానదిపై ప్రాజెక్టుల పెత్తనాన్ని కేంద్రంలో చేతుల్లో పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వసంత్‌కుమార్, పార్టీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రాములు, ఉమాశంకర్ పాల్గొన్నారు.

పరిగి: నల్లగొండలో నిర్వహించిన బీఆర్ఎస్ సభకు పరిగి నియోజకవర్గం నుంచి ఆపార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా పరిగికి చేరుకున్నారు. పరిగిలో నల్లగొండకు తరలివెళ్లే బస్సులను పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అన్ని మండలాల నుంచి 30 బస్సుల వరకు తరలివెళ్లారు. నల్గొండకు తరలివెళ్లినవారిలో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, నాయకులు సురేందర్, ప్రవీణ్ రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ఎండీ మౌలానా పాల్గొన్నారు.

కులకచర్ల: నల్లగొండలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ సమావేశానికి కులకచర్ల ఉమ్మడి మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో



పరిగి: నల్లగొండ సభకు బయల్దేరుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, నాయకులు

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. పార్టీ ప్రభుత్వాన్ని కోల్పోయిన తర్వాత మొదటి సారిగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ కావడంతో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీరంపల్లి రాజు, కృష్ణయ్యగౌడ్, సారా శ్రీనివాస్, లక్ష్మయ్య, రాములుగౌడ్, ఆంజనేయులు, రాములు, బాలకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

దోమ: నల్లగొండ సభకు దోమ మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, ఊటుపల్లి, పాలెపల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు



ఊరచెరువులో గాలింపు చర్యలు

యాలాల, ఫిబ్రవరి 13: చెరువులో చేపల కోసం వెళ్లి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. యాలాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన కొంగి హరీష్(25సంవత్సరాలు) మాల శ్రీశైలం, కొండాపూరం ఎల్లప్పలు కలిసి గ్రామ సమీపంలోని ఊరచెరువులోకి సోమవారం రాత్రి చేపలు పట్టడానికి వెళ్లారు. మద్యం మత్తులో ఉన్న ఈ ముగ్గురు చెరువులోకి దిగారు. అంతలోనే హరీష్ గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని శ్రీశైలం, ఎల్లప్పలు గ్రామానికి వచ్చి కుటుంబీకులకు తెలిపారు. చీకటి పడడంతో మంగళవారం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసు, తహసీల్దార్, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారి ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను రంగంలోకి దింపినా లాభం లేకపోవడంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల పోలీసులు తెలిపారు.

చిరుత సంచారం?



ఆనవాళ్లను గుర్తిస్తున్న ఫారెస్టు అధికారి

దౌల్తాబాద్, ఫిబ్రవరి 13: దౌల్తాబాద్ ఫారెస్టు పరిధిలో కౌడీడ్-రావులపల్లి రోడ్డు మూలమలుపులో చిరుతపులి కనిపించిందని కారులో వెళ్తున్న సుల్తాన్‌పూర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఫారెస్టు అధికారులకు తెలపగా వారు అక్కడికి చేరుకొని ఆనవాళ్లను గుర్తించారు. రోడ్డుపై నుంచి వెళ్లింది చిరుతనా? లేక హైనానా? అనేది గుర్తించాల్సి ఉందని అధికారులు తెలిపారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13: భార్య, కోడలిని గొడ్డలితో నరికి హత్యాయత్నం చేసి పరారైన ఓ వ్యక్తిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపారు. ఇన్‌స్పెక్టర్ బి.రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నానగర్‌లో నివాసముంటున్న చామకూర ప్రతాప్ వ్యవసాయంతో పాటు మేస్త్రీ పనులు చేస్తున్నాడు. వచ్చిన ఆదాయాన్ని కుటుంబ సభ్యులకుఇవ్వకుండా జల్సాలు చేసేవాడు. 2017లో వచ్చిన ఆదాయాన్ని కుటుంబ అవసరాల నిమిత్తం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించిన భార్య ప్రమీలను ఇనుపరాడుతో కొట్టి గాయపరిచాడు. అప్పుడు అతడిపై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మరో సారి 2019లో కొడుకు పెళ్లిని వ్యతిరేకించి అడ్డుకున్నా వినలేదని కక్ష పెంచుకున్నాడు. గతేడాది ఆగస్టు 20న గొడ్డలి తీసుకుని ప్రమీల తలపై కొట్టగా అడ్డువచ్చిన కోడలు కల్యాణిని గాయపరిచి పరారయ్యాడు. కేసు నమమోదు చేసుకున్న పోచారం ఐటీసీ పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. మంగళవారం ఉదయం అన్నోజిగూడ బస్టాండ్ వద్దఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి, కానిస్టేబుల్ యాదగిరిలు నిందితుడు ప్రతాప్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

తాండూరురూరల్, ఫిబ్రవరి 13: వీరశెట్టిపల్లి వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి మిట్టబాస్పల్లికి చెందిన రాథోడ్ సంతోష్‌నాయక్ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు సంతోష్‌నాయక్‌ను విచారించగా, చోరీ నేరం ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితున్ని రిమాండ్‌కు పంపడం జరిగిందని ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

అదుపు తప్పి బోర్‌వెల్ వాహనం బోల్తా

కులకచర్ల, ఫిబ్రవరి 13: ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోర్‌వెల్ వాహనం బోల్తాపడింది. చౌడాపూర్ మండలంలోని మక్తవెంకటాపూర్‌లో మంగళవారం ఓ వ్యవసాయ పొలంలో బోరు వేసేందుకు వాహనం బయల్దేరింది. ఈక్రమంలో అదుపుతప్పి పంటపొలాల్లో బోల్తాపడింది. వాహనంపై ఉన్నవారు క్షేమంగా బయటపడ్డారు.

నాళాలపై నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13: నాళాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఇరిగేషన్ ఏఈ పరమేష్ హెచ్చరించారు. మండలంలోని చౌదరిగూడలో మంగళవారం నాళాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన ఏఈ సిబ్బందితో అక్కడికి చేరుకొని విచారణజరిపి ఎక్స్‌కావేటర్‌తో నిర్మాణాలను కూల్చివేయించారు.

సమాజానికి సేవ చేయడమే లక్ష్యం



నియామక పత్రం అందుకుంటున్న రమేష్ గుప్త

మేడ్చల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమాజానికి సేవ చేయడమే వాసవి క్లబ్ లక్ష్యమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ భానురి నర్సింహులు అన్నారు. మేడ్చల్ వాసవి క్లబ్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.ఎస్.తాళ్లపల్లి రమేష్‌గుప్త, కార్యదర్శులుగా గోలి లక్ష్మణ్, తాళ్లపల్లి నాగేష్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని శాలువాలతో సత్కరించి క్లబ్‌సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వంకమామిడి రాజేందర్ పాల్గొన్నారు.

గురుకుల పీజీటీ మ్యాథ్స్‌లో 160వ ర్యాంకు సాధించిన అశోక్



పిట్టల అశోక్

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13: గురుకులాల్లో పీజీటీ పోస్టులకు నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామానికి చెందిన పిట్టల అశోక్ 134 మార్కులతో 160వ ర్యాంకు సాధించాడు. ఉస్మానియా యూనివర్సిటీలో యంఎస్సీ బీఎడ్ అభ్యసించిన అశోక్ గురుకులాల్లో పీజీటీ పోస్టుకు దరఖాస్తు చేసుకొని పరీక్ష రాశాడు. సోమవారం వెలువడిన పరీక్షా ఫలితాల్లో 160వ ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఆయనను అభినందించారు.

ధ్యానంతో సకల రోగాలు దూరం

దోమ, ఫిబ్రవరి 13: ధ్యానంతో సకల రోగాలు దూరమవుతాయని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త గుండం శైలజ అన్నారు. మండలంలోని ఊటుపల్లి, తిమ్మాయిపల్లి, రాకొండ, బ్రాహ్మణపల్లి, బుద్లాపూర్ గ్రామాల్లో మంగళవారం ప్రజలకు ధ్యాన శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నవీన్, రాంచంద్రయ్య, శ్రీను, రాధ, గుండం శోభిత, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలి

పరిగి, ఫిబ్రవరి 13: సివిల్ తగాదాల్లో తలదూర్చి అర్హులకు అన్యాయం చేస్తున్న పరిగి డీఎస్పీ, దోమ ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు ఎం.వెంకటయ్య, రాథోడ్ శ్రీనివాస్, భాస్కర్, అంజిరావణ్‌లు డిమాండ్ చేశారు. వారు మంగళవారం పరిగిలో మాట్లాడుతూ.. తిమ్మాయిపల్లిలో అయూబ్ అనే రైతుకు చెందిన భూమిని, ఇతరులచే కబ్జా చేసేందుకు కారణమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సదరు రైతుకు న్యాయంచేసి, పోలీసులపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

నవాబుపేట, ఫిబ్రవరి 13: ఈనెల 16వ తేదీన గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అంజయ్య, కుమార్, దుర్గయ్య, శివకుమార్, నర్సింహులు, గోపాల్, లింగయ్య, శివశంకర్, బి.శివకుమార్, రాజు తదితరులు పిలుపునిచ్చారు. నవాబుపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణలో మంగళవారం గ్రామీణ భారత్ బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బంద్‌కు కార్మిక, కర్షకులు, ఉద్యోగ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బషీరాబాద్ తహసీల్దార్‌గా వెంకటేష్



బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, ఫిబ్రవరి 13: ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో బషీరాబాద్ తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్.వెంకటస్వామి సంగారెడ్డి జిల్లాకు వెళ్లారు. దీంతో వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు బొంరాస్‌పేట్ మండల తహసీల్దార్‌గా ఉన్న వై.వెంకటేష్‌ను ఇక్కడా నియమించడంతో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేయడం అదృష్టం



అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేయడం తమ అదృష్టంగా భావించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళ వారం బదిలీపై వెళ్తున్న జిల్లా అధికారులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న జిల్లా అధికారులు సీఈవో జానకి రెడ్డి, డిప్యూటీ సీఈవో సుభాషిని, డీపీవో తరుణ్ కుమార్, డీఆర్డీవో కృష్ణన్, డీడబ్ల్యూవో లలితకుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర, డీఏల్పీవో అనితలను కలెక్టర్, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు అంకితభావంతో ప్రజలకు సేవలందించే క్రమంలో సంతృప్తిని కలిగిస్తుందని అన్నారు. పదిమందికి మేలు చేసినప్పుడే ఉద్యోగానికి న్యాయం చేసిన వారమవుతామని తెలిపారు. జిల్లాలో సమర్థవంతంగా పనిచేసిన అధికారులు బదిలీ అయినప్పటికీ ఉద్యోగ నిర్వహణలో ఎక్కడికి వెళ్లినా కొత్త ఆలోచనావిధానంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. బదిలీ అవుతున్న అధికారులు జిల్లాకు అందించిన సేవలు సంతృప్తిని కలిగించిందని చెప్పారు. ఉద్యోగులందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే ఉద్యోగానికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, డీసీఎస్‌వోఓ రాజేశ్వర్, డీఎస్సీడబ్ల్యూవో మల్లేశం, డీటీడబ్ల్యూ కోటాజీ, డీవైఎస్‌వో హనుమంతరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజస్, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, పశుసంవర్దకశాఖ అధికారి అనిల్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామిరెడ్డి, మిషన్‌భగీరథ ఈఈ చల్మారెడ్డి, డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్, డీబీసీడబ్ల్యూవో ఉపేందర్, డీఎల్పీవో శంకర్ నాయక్, ఎంపీవో నాగరాజు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ బ్లాస్టింగులపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13: నిబంధనలు పాటించకుండా బ్లాస్టింగులు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నిశిజా ఇన్‌ఫ్రా ఎన్ఎల్‌పీ సంస్థ నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్ డిమాండ్ చేశాడు. మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మైనింగ్ నిబంధనలు పాటించకుండా అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం నాడు ప్రజావాణిలోనూ పిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. నిబంధనలు పాటించకుండా చేపడుతున్న బ్లాస్టింగులతో చుట్టుపక్కల ఇళ్లకు పటుళ్లు వస్తున్నాయని వివరించారు. సర్వేనెంబర్లు 527/పి, 543/3, 543/4/పి, 543/5/పి, 543/6 ,543/7, 543/8 ,543/8పి, 543/9లలోని 115 ఎకరాల్లో చేపట్టిన లేఆవుట్ నిర్మాణంలో భారీగా బ్లాస్టింగులు చేస్తున్నారని దీంతో రాళ్లు చాలాదూరం వరకు ఎగిరిపడి ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈపరిసరాలలో నివసించే మూగ జీవాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. లేఆవుట్ ప్రకారం ప్లాట్లు చేయడంలేదని ఆరోపించారు. అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడంలేదని వాపోయారు.

విద్యార్థుల స్వయం పాలన



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

కొడంగల్, ఫిబ్రవరి 13: విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కొడంగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. హెచ్ఎంగా రాంచరణ్, డీఈవోగా శివశంకర్, ఎంఈవోగా ఉజైఫాన్‌తో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు అబ్దుల్‌హక్, వెంకటేశం, సాలిబాయి, సబీహాబేగం, నసీంబేగం తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. కలెక్టర్‌గా సాహితియాదవ్, డీఈవోగా హర్షిత, ఎంఈవోగా రోహిత్, హెచ్ఎంగా స్నేహ, వైద్యులుగా సాయి, నిహారిక, పీఈటీలుగా సాయిరాం, సునీల్‌తో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. స్వయం పాలనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమద్, శ్యామ్, పార్వతి, స్వరూప, కవిత, యాదమ్మ, నస, శ్రీవాణి, నవనీత, రూపవతి, సమ్రీన్, శ్రీలత, శ్వేత పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు, ఫిబ్రవరి 13: ధారూరు పీఎస్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పి.రాములు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు పి.బసప్ప, నాయకులు నారాయణరెడ్డి, మల్లారెడ్డి, బల్వంత్‌రెడ్డి, బలవర్దన్‌రెడ్డి, పాండు నాయక్, సత్యనారాయణ గౌడ్, హరిచంద్, రమేశ్‌కృష్ణ, ముజాఫర్, ప్రకాష్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా ఐక్యంగా ఉండాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13: రైతులంతా ఐక్యంగా ఉండాలని రాష్ట్ర కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడలో మంగళవారం కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగాన కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ పార్టీలు వేరైనప్పటికీ రైతులంతా కలిసి కట్టుగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా రైతులు ఐక్యంగా ఉండటం వలన ప్రజాప్రతినిదులు, అధికారులను కలిసి పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, రామలింగారెడ్డి, కొంతం అంజిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి స్థానిక రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13: కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ, లయన్స్‌క్లబ్ ఆఫ్ కందూరి రాంరెడ్డి మహబూబ్‌నగర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో ఆప్తాల్మిక్ వైద్యుడు హరినాథ్‌నెహ్రూ కంటిపరీక్షలు నిర్వహించారు. అందులో 35 మందికి ఆపరేషన్‌ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని కందూరి రాంరెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద యువతికి పెళ్లికానుక



పొట్టిగడ్డతండాలో పెళ్లికానుక అందజేస్తున్న మాజీ సర్పంచ్ శాంతితులసిరామ్

కులకచర్ల, ఫిబ్రవరి 13: మండలంలోని పటేల్ చెరువు తండా జీపీలోని పొట్టిగడ్డ తండాకు చెందిన విస్లావత్ మారుని చందర్‌నాయక్ కూతురు వనిత పెళ్లి బుధవారం జరగనుంది. పెళ్లి కానుకగా మాజీ సర్పంచ్ శాంతి తులసిరామ్ మంగళవారం క్వింటాలు సోనా బియ్యం, 15 కేజీల నూనె డబ్బా అందించారు. పదవీలో ఉన్నప్పుడు ఎలాగైతే కానుక అందించడం జరిగిందో ఇప్పుడు కూడా అదే విధంగా సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రాజు, పొట్టిగడ్డ తండా లక్ష్మీ, రాము, మంచికుంట తండా ఉమ్లా నాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ



అబ్దుల్ రెహాన్‌ను అభినందిస్తున్న డీఈవో

మేడ్చల్ ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో మేడ్చల్ జిల్లా విద్యార్థి అబ్దుల్ రెహాన్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించాడు. డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాధికారిణి విజయకుమారి విద్యార్థి అబ్దుల్ రెహాన్‌ను మంగళవారం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ అధ్యక్షుడు మదన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పి.శ్రీనయ్య, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌పై దాడి అమానుషం

తాండూరు, ఫిబ్రవరి 13: అచ్చంపేట మార్కెట్ చైర్మన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు బాలేశ్వరగుప్తా తాండూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. సంఘం అధ్యక్షుడు కట్కం వీరేందర్, కార్యదర్శి కోట మురళికృష్ణ, ఉపాధ్యక్షుడు ఆలంపల్లి శ్రీనివాస్, దాదాపురం రవీందర్, సహాయ కార్యదర్శి, కోశాధికారి సంతోష్‌కుమార్‌లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో దాడులను తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మక్తవెంకటాపూర్ వాసి పీడీగా ఎంపిక

కులకచర్ల, ఫిబ్రవరి 13: గురుకులాల్లో పీజీటీ పోస్టులకు వెలువడిన పరీక్షా ఫలితాల్లో ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. మండలంలోని ఎత్తుకాల్వ తండా పరిధిలోని టేకులతండాకు చెందిన భరత్‌కుమార్ పీజీటీ బయోసైన్స్ ఉద్యోగానికి ఎంపిక కాగా చౌడాపూర్ మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన ప్రమీల ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగాన్ని సాధించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కీసర, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఎస్‌బీఐ నాచారం రీజినల్ జోన్ మేనేజర్ విజయసారథి అన్నారు. ఆహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీకి చెందిన పోలకం బాలమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా పాలసీకి రూ.2లక్షల బీమా అందజేసినట్లు తెలిపారు. దీంతో విజయసారథి మంగళవారం చీర్యాల్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో బాలామణి కుమారుడు సాయివంశీకి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి రాజీనామా

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 13: నామమాత్రపు పదవికి రాజీనామా చేసినట్లు మండలంలోని తుంకిమెట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తోలు వెంకటయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్‌లో ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని, ఐదేళ్లుగా తనను నామమాత్రంగా ఉంచారని వాపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని మండల నాయకులు మోసంచేసి ఓడించారన్నారు.

16న అనంతగిరి రథసప్తమి వేడుకలు

వికారాబాద్, ఫిబ్రవరి 13: ఈ నెల 16వ తేదిన అనంతగిరి ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఎన్.పద్మనాభం, ఏవో నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30కు సూర్యప్రభ వాహనం, 9గంటలకు హనుమంతవాహనం, 10.30 ముత్యాల పందిరి వాహనం, 11గంటలకు గరుడ వాహనం, 3గంటలకు గజ వాహనం, 4 గంటలకు సింహవాహనం, 5 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామి వారిని ఊరేగించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సంక్షిప్తంగా..

● **వికారాబాద్:** ప్రముఖ విద్యావేత్త, విశ్రాంత సాహిత్యాచార్యులు డాక్టర్ హారతి ద్వారకానాథ్ రచించిన హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమం గ్రంథావిష్కరణ సభ శనివారం ఉదయం 11గంటలకు స్థానిక సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు గ్రంథ రచయిత హారతి ద్వారకనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ డెలవప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, ముఖ్య అతిథిగా హాజరువుతారని తెలిపారు. అదేవిధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ మాజీ చైర్మన్ కె. ప్రభాకర్‌రెడ్డి సభకు అధ్యక్షత వహిస్తారన్నారు.

● **ధారూరు:** ధారూరు గ్రామ దేవత మైసమ్మతల్లి తృతీయ వార్షికోత్సవ పూజలను మంగళవారంఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి అలంకరణచేసి, హోమ పూజలు చేశారు. మైసమ్మతల్లికి నైవేద్యం సమర్పించి హారతినిచ్చి మొక్కుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** ప్రజాసమస్యలపై చర్చించేందుకు ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **బషీరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీ పథకాల్లోని గృహజ్యోతి పథకాన్ని అమలు చేసే అంశంలో విద్యుత్‌శాఖ సిబ్బంది ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. మండలంలో 36 గ్రామ పంచాయతీల పరిధిలో 6,993 గృహ వినియోగ కనెక్షన్లు ఉన్నాయి. ఈ పథకం అమలుకు అర్హులను నిర్ణయించేందుకు సిబ్బంది ఆయా గ్రామ పంచాయతీలో కూర్చుని వివరాలు సేకరిస్తున్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు స్లిప్పు, ఆధార్‌కార్డు, ఆహార భద్రత కార్డు, సెల్‌ఫోన్ నంబరు, ఇంటి సర్వీస్ నంబర్లను సేకరించి ఆన్‌లైన్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

● **కొడంగల్:** పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16న రథసప్తమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని జయప్రదం చేయాలని కోరారు.